


"ప్రియమైన రాధాదేవీ,

చాలారోజులు తీక్షణంగా, తీవ్రంగా ఆలోచించినమీదట ఈ ఉత్తరం నీకు వ్రాస్తున్నాను. ఇన్నిరోజులుగా నీకు ఉత్తరాన్ని వ్రాసే ధైర్యాన్ని కూడదీసుకున్నాను. సహృదయంతో నా ఆవేదనను అర్థం చేసుకుంటావని ఆశిస్తాను...

రాధా!

ఈ ఉత్తరం చదివి నీకు చాలా కోపం రావచ్చని నేను అంచనా వేసుకుంటున్నాను. నీ కనుబొమలు పైకి లేచి, పెదిమలు బిగుసుకుపోయి, బుగ్గలన్నీ కెంపులుగా మారినపుడు...అబ్బ! నీవు కోపంలో ఎలా ఉంటావో ఊహించుకుంటేనే, పరవశించిపోతున్నాను. నీ అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. భగవంతుడు తన ప్రజ్ఞనంతా వినియో

గించి నిన్ను మలిచాడు. అందాన్ని ఆరాధించే పుజారిని నేను...

రాధ, చేతిలోని ఉత్తరాన్ని, పర్రున చించి, ముక్కలను కాలికింద వేసి త్రొక్కింది. క్షణకాలం రంగారావుకేసి నమిలిమింగేసేటట్టు చూసింది.

ఉత్తరం వ్రాసింది నీవేనా.

కోపంలో ఉన్నప్పుడు రాధ అందాన్ని రకరకాలుగా ఊహించుకుని మురిసిపోయిన రంగారావు కొంచెం సేపు చేతులు నలుపుకున్నాడు. రాధ మొహంలోకి చూసే ధైర్యం లేక గుటకలు మ్రింగాడు.

నేనే!

"సిగ్గులేదూ ... ఏమిటిది?"

"లెటరు"... తడబడుతూ అన్నాడు రంగారావు.

"అది తెలుసు. నాకెందుకు వ్రాశావూ అని అడుగుతున్నాను?"

రంగారావు పూర్తిగా తెగింపు చేయదలుచుకున్నాడు. చుట్టూ ఒకసారి కలయజూచాడు. చుట్టూ ఉన్న జనం ఎవరూ అంతగా యీ విషయాల్ని పట్టించుకోక పోవడం గమనించి కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు.

"రాధా! ... నీ అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తుంది. నేను నిన్ను వేళాకోళం చేయాలనిగాని, మోసం చేయాలని గాని వ్రాయలేదీ ఉత్తరం. నీ అందం నాకు కావాలి; లేకపోతే బ్రతకలేను. అందుకే ఆ ఉత్తరం వ్రాశాను. ఆపైన నీ యిష్టం." రంగారావు సాధ్యమైనంత మృదువుగా చెప్పాడు.

రంగారావు మాటలు విని రాధకు నవ్వు వచ్చింది.

"అదికాదోయ్ పూజారీ! అయితే నన్ను పెండ్లి చేసుకుంటావన్నమాట!"

"ఓ! అంతకంటేనా...రంగరావు. చాలా సంబరపడిపోయాడు...ఎలా... ఇదివరకే నీకు పెళ్ళయిందే! క్రీగంట చూస్తూ అంది రాధ...అది కేవలం నా కిష్టంలేని పెండ్లి...మానాన్న నాకు బలవంతంగా చేశాడు...మీరు ఊఁ అంటే రేపిపాటికి ఆమెకు విడాకులు సిద్ధం చేస్తాను" .. అది తన కో లెక్కలోనిది కాదన్నట్లు ధీమాగా పలికాడు రంగారావు...

"ఎందుకంటే...రాధా...నీ అందం అలాంటిది... అంతే...యింక నే నేమీ చెప్పలేను."

"సర్సరే...ముందా విషయం చూడు...అంతవరకూ యిలాంటి అర్థం పర్థంలేనిపనులు చేయకు! నాకు బావుండదు... మీ నాన్నావాళ్ళతో ఆస్తిపాస్తుల విషయంలోకూడా తెగతెంపులు చేసోక్కోవాలి సుమా! లేకుంటే బావుండదు..." రాధ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

అర్థంలేని మనుష్యులు ... ఇదంతా పైత్యం ... ఒకవిధంగా చెప్పాలంటే వెర్రి...విడాకు లిస్తాడా...ఇస్తాడు... వాళ్ళ మావ ఊరుకుంటాడా... మాటలు చెప్పగానే సరిపోయిం దేమిటి? రాధ ఆలోచించుకుంటూ...మధ్యమధ్య నవ్వు కుంటూ యింటికి పోయింది.

కొన్నిరోజులు గడిచిపోయాయి ...

రాత్రి పదిగంటల సుమారుకు తలుపు తడుతుంటే రాధ లేచి, తలుపు తీసి, బైట నుంచున్న రంగరావును చూసి నిర్ఘాంత పోయింది...రంగారావు చాలా ఖుషీగా కనిపించాడు.

"నువు కోరినట్లుగా దానికి విడాకు లిచ్చాను...యిదుగో, యిది కోర్టునుంచి మన వివాహంకోసం తెచ్చుకున్న పర్మిషను...

రాధ అచేతనంగా చూస్తూ - ఉండి పోయింది...

"ఇక ఆస్తిలో నావాటా మా నాన్నా వాళ్ళతో దెబ్బలాడి పూర్తిగా పంచేసు కున్నాను...మొత్తం వాటా నాపేర, నీ కోసం రిజిష్టరీ చేయించాను...'' ఒక్కొ క్కటీ కాగితాలు తీసి విడమరుస్తూ చూపుతున్న రంగారావును చూసి రాధ విస్తుపోయింది...

"అందమైన ఓ రాధాదేవిగారూ! ఇపుడు మనపెండ్లికి అభ్యంతరా లేమిటి...'' రంగారావు ముప్పిరిగొన్న సంతోషంతో అడిగాడు.

"అభ్యంతరాలా... ఒకటేమిటి, చాలా ఉన్నై! ముందువిషయం.. అసలు నా కిష్టంలేదు...'' రాధ నీరసంగా మెల్లగా అంది...

"ఏం, ఎందుకూ...?"

"ఎందు కేమిటి...కట్టుకున్న భార్య కన్న కొస్త ఎర్రగా...అందంగా ఉన్న అమ్మాయి కనిపిస్తే భార్యకు విడాకు లిచ్చి, ఆస్తి పంచుకునివచ్చిన నీవు...రేపు నిన్ను నేను పెండ్లి చేసుకున్నాక...నాకన్న అందమైనవాళ్ళు కనిపిస్తే నన్ను చంప డానికయినా వెనుదీయవు...అమ్మో... మ వ్వంటే నా కసహ్యాం... అంతకు మించి భయం..."

రాధ గ్రుక్క త్రిప్పుకుని తలుపు గట్టిగా, విసురుగా మూసివేసింది...

రంగారావు దిగాలుపడి స్థాణువులా నుంచుండిపోయాడు ... చేతిలోని కాగి తాలు గాలికి రెపరెప లాడాయి.